క్లుప్తంగా

వృద్ధాశ్రమంలో న్యాయవిజ్ఞాన సదస్సు



నగరంపాలెం: జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు ప్రత్తిపాడు మండలం కోయవారిపాలెంలోని నవీన ఆదర్శ మహిళా మండలి (వృద్ధాశ్రమం)లో మంగళవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. సంస్థ జిల్లా కార్యదర్శి టి.లీలావతి వృద్ధాశ్రమంలో అందిస్తున్న సదుపాయాలు, వారు భుజించే ఆహారాన్ని తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తంచేశారు. సీనియర్ సిటిజెన్స్ చట్టాలు, హక్కులపై వివరించారు. ఎవరికై నా రేషన్, ఆధార్ కార్డులు లేకపోతే గుంటూరు న్యాయ సేవాధికార సంస్థ టోల్‌ఫ్రీ నంబర్ 0863–2224886కు లేదా రాతపూర్వకంగా తెలియజేయవచ్చునని తెలిపారు. తద్వారా జిల్లా అధికారులతో సంప్రదించి, చట్ట పరిధిలో న్యాయ సహాయం అందించి, సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. సదస్సులో మహిళా మండలి నిర్వాహకులు, వృద్ధులు పాల్గొన్నారు.

చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలి

ఐసీడీఎస్ సీడీపీఓ కృష్ణవేణి



నెహ్రూనగర్: చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని ఐసీడీఎస్ సీడీపీఓ కృష్ణవేణి, సెక్టార్ సూపర్‌వైజర్ ఎస్ఎస్ తబిత పేర్కొన్నారు. మంగళవారం ఇజ్రాయేల్‌పేట, మణిపురం అంగన్‌వాడీ సెంటర్ల పరిధిలో నేను బడికిపోతా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించడం ద్వారా వారికి ఆటపాటలతో కూడిన చదువుతో పాటు, పౌష్టికాహారం అందించడం జరుగుతుందన్నారు. అనంతరం 6 సంవత్సరాలు పైబడిన చిన్నారులను ఇశ్రాయేల్ పేట ప్రైమరీ స్కూల్‌లో చేర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రైమరీ స్కూల్ హెడ్ మాస్టార్ డేవిడ్, అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు, తల్లులు పాల్గొన్నారు.

రామాయణం ఒక అమృత సాగరం



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై మంగళవారం సంక్షిప్త రామాయణం – ధారావాహిక ప్రవచనం నిర్వహించారు. సుందర సత్సంగ్ సభ్యులు కె.వి.కోటేశ్వరరావు మాట్లాడుతూ రామాయణం ఒక సుధాసాగరం అని అన్నారు. రామాయణంలోని ప్రతి బిందువు ప్రాణప్రదం, ప్రతి అక్షరం మోక్షప్రదం, ప్రతి అక్షరం పాప నాశనమని పేర్కొన్నారు. రామాయణం భూప్రపంచంలో నదులు, పర్వతాలు ఉన్నంత వరకు నిలిచి ఉంటుందని బ్రహ్మదేవులు వాల్మీకి తెలిపారని అన్నారు. భారతీయత ఉన్నంత కాలం రామాయణం అజరామయంగా ఉంటుందని చెప్పారు. మనిషిలోని వ్యవసనాలను తొలగించి, విశేష మార్గంలో నడిపించిన కావ్యం సంక్షిప్త రామాయణమని తెలిపారు. ఆలయ కమిటీ ఉపాధ్యక్షులు లంకా విజయబాబు, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, ఎం. సత్యనారాయణ, వి.ఏకాంబరేశ్వరరావు, ఆర్.వి.బసవేశ్వరరావు, మన్నవ రవిప్రసాద్ పాల్గొన్నారు

నేడు మహంకాళి ఆలయ హుండీ కానుకల లెక్కింపు

తాడేపల్లి రూరల్ : దుగ్గిరాల మండల పరిధిలోని కంఠంరాజు కొండూరు గ్రామంలో శ్రీ మహంకాళి అమ్మవారి దేవస్థానం హుండీ లెక్కింపు కార్యక్రమం బుధవారం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ కార్యనిర్వహణాధికారి డీసీహెచ్ వెంకటరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అమ్మవారికి భక్తులు సమర్పించిన కానుకలను ఉదయం 10 గంటల నుంచి లెక్కించనున్నారు. ఆసక్తి కలిగిన వారు లెక్కింపు కార్యక్రమంలో పాల్గొనవచ్చు.

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెంచాలి

కాకుమాను: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలు పెంచేలా ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని ఎంఈఓ కేఎఫ్ కెనడీ సూచించారు. స్థానిక మండల పరిషత్ ప్రాథమిక (స్పెషల్) పాఠశాలలో మంగళవారం ఇద్దరు చిన్నారులను పాఠశాలలో చేర్పించారు. ఈ సందర్భంగా కెనడీ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో విద్యార్థులకు విలువలతో కూడిన నాణ్యమైన గుణాత్మక విద్య అందిస్తున్న విషయాన్ని తల్లిదండ్రులకు వివరించాలన్నారు. వారి పిల్లలను చేర్పించేలా అవగాహన కల్పించాలని సూచించారు. ప్రైవేట్ పాఠశాలల కంటే దీటుగా సర్కారు బడులు ఉన్నాయని గుర్తుచేశారు. విద్యార్థులకు కావాల్సిన అన్ని వసతులు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ప్రతి రోజు విద్యార్థులకు మంచి పోషక విలువలతో కూడిన ఆహారాన్ని కూడా అందిస్తున్నారని పేర్కొన్నారు.

డ్రెయిన్ల పూడికతీత వేగవంతం చేస్తాం

- నగర కమిషనర్ కీర్తి చేకూరి
- అవుట్ ఫాల్ డ్రెయిన్లలో పూడికతీత పనుల పరిశీలన

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ప్రధాన అవుట్ ఫాల్ డ్రైన్లలో పూడికతీత పనులను వేగంగా చేపట్టాలని, పనులకు ముందు, అనంతరం ఫొటోలు తీయాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం బుడంపాడు, సంగడిగుంట, కమ్మ శేషయ్య గ్రౌండ్ రోడ్, నల్లచెరువు తదితర ప్రాంతాల్లోని అవుట్ ఫాల్ డ్రైన్లలో జరుగుతున్న పూడిక తీత పనులను ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులతో కలిసి పరిశీలించి, తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు నగరంలో వర్షం నీరు నిలిచి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక, ప్రజారోగ్య అధికారులు సమన్వయంతో పూడికతీత పనులు చేపట్టాలన్నారు.



పొక్లెయిన్‌తో పూడిక తీయిస్తున్న దృశ్యం

వర్షాలకు ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా అధికారులు బాధ్యత తీసుకోవాలన్నారు. ప్రధాన అవుట్ ఫాల్ డ్రెయిన్లలో పూడిక తీత పనులు త్వరగా పూర్తి చేసి, ప్రతి ఏడాది వర్షాలకు పొంగే ఇంటర్నల్ డ్రెయిన్లలో కుడా పూడిక తీయడానికి, వాటిపై ఉన్న ఆక్రమణల తొలగింపునకు ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక, ప్రజారోగ్య విభాగాలు సమన్వయంతో ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. పూడిక తీత పనులను ఎమినిటీ కార్యదర్శులు దగ్గరుండి



అధికారులకు సూచనలిస్తున్న కమిషనర్ కీర్తి చేకూరి

పర్యవేక్షణ చేయాలన్నారు. పనులు జరుగుతున్న ప్రాంతాల్లో స్థానికుల సంతకాలు తీసుకోవాలని, డ్రెయిన్ పూర్తి డెప్త్ వరకు పూడిక తీయాలన్నారు. ఈ పర్యటనలో ఎస్.ఈ. శ్యాం సుందర్, ఎంహెచ్ఓ(ఎఫ్ఏసీ) మధుసూదన్, ఈఈలు కోటేశ్వరరావు, కొండారెడ్డి, ఎస్ఎస్‌లు రాంబాబు, అయూబ్ ఖాన్, డీఈఈ శ్రీధర్, ఏఈలు సునీల్ కుమార్, రాంబాబు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

భారత ప్రజాస్వామ్యంలో ఎమర్జెన్సీ చీకటి అధ్యాయం

లక్ష్మీపురం: ప్రాథమిక హక్కుల అణచివేత, అరెస్టుతో 21 నెలలు కొనసాగిన అత్యాయిక పరిస్థితి భారత ప్రజాస్వామ్యంలో ఓ చీకటి అధ్యాయంగా మిగిలిపోయిందని అవగాహన సంస్థ సభ్యులు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో 'ఆ ఎమర్జెన్సీ రోజులు' అంశంపై సమావేశం జరిగింది. విద్యావేత్త, విశ్లేషకులు ఇ.చంద్రయ్య మాట్లాడుతూ సరిగ్గా 50 ఏళ్ల క్రితం అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ విధించి, ప్రజల ప్రాథమిక హక్కులను కాలరాశారన్నారు. 21 నెలలు నియంతృత్వ పాలన భారత దేశ ప్రజాస్వామ్య చరిత్రలో ఒక చీకటి అధ్యాయంగా మిగిలిపోయిందన్నారు. న్యాయవాది అవధానుల హరి మాట్లాడుతూ అంతర్గత అలజడి పేరుతో ఎమర్జెన్సీ విధించిన ప్రధాని ఇందిరాగాంధీ తన రాజకీయ ప్రత్యర్థులను జైలుకు పంపారని, ఎన్నికలను వాయిదా వేశారని, ప్రభుత్వ వ్యతిరేకతను తీవ్రంగా అణచివేయడం,



సమావేశంలో మాట్లాడుతున్న అవగాహన సంస్థ సభ్యులు

పత్రికలపై నియంత్రణ విధించడం లాంటి చర్యలను చేపట్టారన్నారు. విశ్లేషకులు ఆర్.వి.సింగరయ్య మాట్లాడుతూ స్వతంత్ర భారత దేశంలో అత్యంత క్రూరమైన, అనర్థమైన నిర్ణయం ఇదేనని, దేశ ప్రజలంతా దీన్ని వ్యతిరేకించి ఇందిరాగాంధీని ఎన్నికల్లో ఘోరంగా ఓడించారన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిని బెదిరించిన పలువురిపై కేసు

గుంటూరు ఈస్ట్: లారీ లీజుకు తీసుకుని తిరిగి ఇవ్వకుండా మోసం చేసిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గుంటూరుకు చెందిన మధుసూదనరావు ఆరు లారీలు హైదరాబాద్‌కు చెందిన కొందరికి లీజుకు ఇచ్చాడు. లీజుకు తీసుకున్నవారు మూడు లారీలను తిరిగి ఇచ్చేశారు. మిగిలిన మూడు లారీలు ఇవ్వకపోగా అడిగినందుకు బెదిరించారు. ఈఘటనపై పిల్లి రామకృష్ణ, ఎస్.శ్రీనివాసరెడ్డి, మధుకర్‌రెడ్డి, షేక్ ఇషాక్‌లపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తిపై దాడి

గుంటూరు ఈస్ట్: వ్యక్తిపై ఇరువురు దాడిచేసిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. ఎస్.మస్తాన్‌రెడ్డి భార్య మంజులశ్రీతో విభేదించాడు. ఇరువురూ కుటుంబ సభ్యులతో మంగళవారం మహిళా పోలీసుస్టేషన్‌కు వచ్చారు. పోలీసు స్టేషన్ వెలుపల మస్తాన్‌రెడ్డిపై మామ గోవిందరెడ్డి, మరిది వెంకటలక్ష్మారెడ్డిలు దాడి చేసి, గాయపరిచారు. మస్తాన్‌రెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దంత వైద్యుల పోస్టులు భర్తీ చేయాలి

గుంటూరు మెడికల్: కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న నేషనల్ ఓరల్ హెల్త్ ప్రోగ్రామ్ ద్వారా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో దంత వైద్యుల పోస్టులు భర్తీ చేయాలని పలువురు దంత వైద్యులు కోరారు. ఈమేరకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యప్రకాష్ యాదవ్‌ను మగళవారం సచివాలయంలో బీజేపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్రతో కలిసి వినతి పత్రం అందజేశారు. కోవిడ్ సమయంలో ఫ్రంట్ లైన్ వారియర్స్‌గా దంత వైద్యులు సేవలందించారని, వారి సేవలను గుర్తించి పీహెచ్‌సీల్లో పనిచేసే అవకాశం కల్పించాలన్నారు. మంత్రికి బొకే అందజేసి శాలువా కప్పి సన్మానించారు. గుంటూరు మహిళా మోర్చా కోశాధికారి డాక్టర్ స్రవంతి, ఆంధ్రప్రదేశ్ దంత వైద్యుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ సతీష్, డాక్టర్ శ్వేత, డాక్టర్ సాయి, తదితరులు ఉన్నారు.



మంత్రిని కలిసి సన్మానిస్తున్న దంత వైద్యులు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటేనే భవిష్యత్తు



మంగళగిరి మాదక ద్రవ్యాల వినియోగానికి విద్యార్థులు దూరంగా ఉండాలని పలువురు వక్తలు సూచించారు. పట్టణంలోని వీటీజేఎం ఐవీటీఆర్ డిగ్రీ కళాశాల, సీకే జూనియర్ కళాశాల విద్యార్థులకు మంగళవారం నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వినియోగ వ్యతిరేక ప్రచార వారోత్సవాలలో భాగంగా ఈ కార్యక్రమం ఏర్పాటైంది. ఈ సందర్భంగా డ్రగ్ ఫ్రీ సూపర్ హీరో సెల్ఫీ కాంటెస్ట్‌ను విద్యార్థులతో నిర్వహించారు. వారితో ప్రతిజ్ఞ చేయించారు. వక్తలు మాట్లాడుతూ డ్రగ్స్ వినియోగంతో జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. బాగా చదివి ఉన్నత శిఖరాలకు చేరాలని కోరారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ నాగేశ్వరరావు, సీకే జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రత్నబాబు, బాలభవన్ జోనల్ కోఆర్డినేటర్ బి. రమేష్, వి.జయపాల్ తదితరులు పాల్గొన్నారు.

తేనెటీగల పెంపకంతో అదనపు ఆదాయం

హార్టికల్చర్ డిప్యూటీ డైరెక్టర్ వీఎస్ ధర్మజ

గుంటూరు రూరల్: పంట దిగుబడులు పెంచడంలో తేనెటీగలు ప్రధాన పాత్ర పోషిస్తాయని హార్టికల్చర్ డిప్యూటీ డైరెక్టర్ వీఎస్ ధర్మజ తెలిపారు. వాటి పెంపకంతో రైతులు అదనపు ఆదాయం కూడా పొందవచ్చని పేర్కొన్నారు. మంగళవారం వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలోని రైతు నేస్తం ఫౌండేషన్‌లో ఏర్పాటు చేసిన రైతు శిక్షణ తరగతుల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పంటల్లో పరపరాగ సంపర్కానికి తేనెటీగలు బాగా ఉపయోగపడతాయన్నారు. ప్రస్తుత జీవనశైలి, రైతులు పంటల సాగులో ఉపయోగించే విష రసాయనాల వల్ల తేనెటీగలు అంతరిస్తున్నట్లు తెలిపారు. అవి అంతరిస్తే మనిషి మనుగడే ప్రశ్నార్థకం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సహజ సిద్ధంగా ఉండే తేనెటీగలతోపాటు అవకాశం ఉన్న రైతులు కూడా వాటిని పెంచాల్సిన అవసరం ఉందన్నారు. తద్వారా అదనపు ఆదాయం పొందొచ్చని చెప్పారు. వ్యవసాయంలో పంట దిగుబడులు కూడా పెరిగి లాభపడతారని తెలిపారు. నాబార్డు సహకారంతో రైతునేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేంద్రియసాగు విధానం, కషాయాలు, మిశ్రమాల తయారీతోపాటు రైతులు పండించిన వ్యవసాయ దిగుబడులకు విలువ జోడింపు వంటి అంశాలపై శిక్షణ అందించటం మంచి పరిణామమన్నారు. కార్యక్రమంలో సేంద్రియ రైతులు



వర్మి కంపోస్టు ఎరువుల తయారీ తీరును క్షేత్రస్థాయిలో తెలుసుకుంటున్న రైతులు

మీసాల రామకృష్ణ, శబరీనాథ్, రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్ యడ్లపల్లి వేంకటేశ్వరరావులు పలు అంశాలను వివరించారు. ప్రస్తుతం మార్కెట్లో అందుబాటులో ఉండే ఆకుకూరలు, కూరగాయలు చాలా వరకు రసాయనాలతో పండించినవే అని పేర్కొన్నారు. రైతులు దిగుబడుల కోసం పిచికారీ చేస్తున్న రసాయన ఎరువుల వల్ల వినియోగదారుల ఆరోగ్యాలు క్షీణిస్తున్నాయని చెప్పారు. సేంద్రియ పంటల ద్వారా రైతుతోపాటు ప్రజల ఆరోగ్యాలు బాగుంటాయని గుర్తుచేశారు. జామ పంటను ఆశించే నెమటోడ్స్ సమస్యకు రసాయనాల్లో సరైన పరిష్కారం లేదని, సేంద్రియ సాగులో ఉందని తెలిపారు. సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులకు విలువ జోడింపు, వివిధ యంత్ర పరికరాలకు సంబంధించిన వివరాలు, వాటి ధరలు, అవి పనిచేసే విధానాలను యడ్లపల్లి వేంకటేశ్వరరావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. శిక్షణకు హాజరైన వారికి సర్టిఫికెట్లు అందజేశారు.

ఏటా భూసార పరీక్షలు చేయించాలి

కాకుమాను: ప్రతి ఏటా సాగుకు ముందు ప్రతి రైతు భూసార పరీక్షలు చేయించి నమూనాల ఆధారంగా పంట వేయాలని ఏఓ బి.సుధారాణి అన్నారు. మండల కేంద్రం పెదనందిపాడులో సోమవారం పలు రైతుల పొలాల్లో మట్టి నమూనా పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. ఏటా ఈ పరీక్షలు చేయించడం వల్ల భూమిలోని పోషకాలను తెలుసుకోవచ్చునని తెలిపారు. వాటి ఆధారంగా సాగు చేస్తే ఆశించిన స్థాయి కంటే అధిక దిగుబడులు సాధించవచ్చునని సూచించారు. భూ సారాన్ని పెంచేందుకు తప్పని సరిగా పచ్చిరొట్ట ఎరువులు సాగుకు ముందు వేయాలని తెలిపారు. 2024–25కి సంబంధించి మండలంలో కౌలుకు సాగు చేస్తున్న రైతులు కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

డయేరియాపై అవగాహన ర్యాలీ

తాడేపల్లి రూరల్ : దుగ్గిరాల మండల పరిషత్ కార్యాలయంలో 'స్టాప్ డయేరియా' పేరిట అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రవిబాబు మాట్లాడుతూ ఐదేళ్లలోపు చిన్నారులు విరేచనాల బారిన పడకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. దుగ్గిరాల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ మహమ్మద్ అబ్దుల్ రహమాన్ మాట్లాడుతూ.. జులై 1 నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నామని చెప్పారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతోపాటు అన్ని ఆరోగ్య ఉపకేంద్రాలలో ఓఆర్ఎస్, మందులు వంటివి అందుబాటులో ఉంచుతామని అన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భవాని మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లులకు, పిల్లలకు అవగాహన కల్పిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు రహమున్నీసా, ఈవోపీఆర్‌డీ శ్రీనివాస్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ జానమ్మ, హెల్త్ ఎడ్యుకేటర్ వి. సుబ్బారావు, ఆరోగ్య కార్యకర్తలు జి. శ్రీనివాసరావు, యస్. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దుగ్గిరాల ఆరోగ్యకేంద్రం వైద్యులు, తదితరులు

వేంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు

గుంటూరు రూరల్: గోరంట్ల గ్రామంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం శ్రవణా నక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో భాగంగా స్వామివారికి అభిషేకాలు, వజ్ర కిరీటాలంకరణ, చేశారు. ప్రత్యేక అలంకారం చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. కార్యక్రమంలో భాగంగా గోరంట్ల గ్రామానికి చెందిన కాకి బ్రహ్మేశ్వరరావు, మల్లేశ్వరి దంపతులు శ్రీ కాశీ అన్నపూర్ణాదేవి అమ్మవారికి, శ్రీ పద్మావతి అమ్మవారికి, శ్రీ అండాళ్ అమ్మవారికి మూడు రకాల బంగారు తాపడంతో తయారు చేయించిన హారాలను సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మోరంపూడిలో విద్యాశాఖ సిబ్బంది ర్యాలీ



తాడేపల్లి రూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని మోరంపూడిలో విద్యాశాఖ తరపున ర్యాలీ నిర్వహించారు. బడి బయట ఉన్న పిల్లలను పాఠశాలకు తీసుకువెళ్లేందుకు విద్యాశాఖ దీన్ని చేపట్టింది. గ్రామంలోని మండల ప్రజాపరిషత్ ఎస్.సి. పాఠశాల ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ – 2 లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ విద్యా హక్కు ప్రతి ఒక్కరిదని తెలిపారు. కొంతమంది చదువుకునేందుకు పాఠశాలకు రాకుండా తల్లిదండ్రులతో పనికి వెళుతున్నారని గుర్తుచేశారు. బడికి వెళ్లబోమని చెబుతున్న వారితోపాటు తల్లిదండ్రులకు చదువుకోవడం వల్ల భవిష్యత్తు లాభాలను వివరిస్తున్నామని తెలిపారు.

వైభవంగా అష్టోత్తర శత కలశాభిషేకం



గోవిందునికి అభిషేకం



దర్శనానికి బారులు తీరిన భక్తులు

నగరంపాలెం: స్థానిక కృష్ణనగర్ ఒకటో వీధిలోని గోదా పద్మావతీ సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో నవదశ శ్రీవార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారికి అష్టోర శత కలశాభిషేకం విశేషంగా నిర్వహించారు. తొలుత కలశారాధన, విశేష పూజలు చేపట్టారు. భక్తులు కలశాలతో ఆలయ ప్రదక్షిణలు చేయగా, అనంతరం స్వామివారిని అభిషేకంతో సేవించుకొన్నారు. సాయంత్రం గోదా పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామికి దివ్య కల్యాణం, తీర్థ ప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా ధనకుదరం శ్రీనివాసాచార్యులు మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల ముగింపులో భాగంగా బుధవారం మహా పూర్ణాహుతి, శ్రీవారి అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

సాగుదారుల హక్కు చట్టాన్ని రద్దు చేయాలి

కౌలు రైతుల సంఘ జిల్లా కార్యదర్శి భైరగాని శ్రీనివాసరావు

లక్ష్మీపురం: ఆంధ్రప్రదేశ్ పంట సాగుదారుల హక్కు చట్టాన్ని (సీసీఆర్సీ)రద్దు చేయాలని, అలాగే 2011 సంవత్సరంలో తీసుకువచ్చిన ఆంధ్రప్రదేశ్ భూ అధీకృత రైతుల చట్టాన్ని పునరుద్ధరించాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి భైరగాని శ్రీనివాసరావు అన్నారు. స్థానిక బ్రాడీపేటలోని సంఘ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భూయజమాని అంగీకారం లేదా సంతకంతో సంబంధం లేకుండా నేరుగా గ్రామసభల ద్వారా కౌలు గుర్తింపు కార్డులు అందజేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం భూయజమానితో సంబంధం లేకుండా నేరుగా గ్రామ సభల ద్వారానే కౌలు రైతులను గుర్తించాలన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలు సంక్షేమ పథకాలు అందించాలని, ఇది జరగాలంటే 2011 భూ అధీకృత రైతుల చట్టాన్ని అమలు చేయాలన్నారు. కౌలు రైతులకు వెంటనే రైతు భరోసా కేంద్రాల ద్వారా సబ్సిడీతో విత్తనాలు, ఎరువులు అందజేయాలని కోరారు. సంఘం నేత మన్నవ నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ సరైన కౌలు చట్టం కోసం కౌలు రైతుల వద్ద నుంచి విస్తృతంగా సంతకాలు సేకరించాలని, గుర్తింపు కార్డులు కోసం కౌలు రైతులతో దరఖాస్తులు పెట్టించాలని తీర్మానించారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు, కౌలు రైతుల సంఘం జిల్లా నాయకులు బొట్ల రామకృష్ణ, భీమవరపు అమ్మిరెడ్డి, మేకల చిట్టిబాబు, ఎర్రమాసు నాగేశ్వరరావు, షేక్ ఇమామ్ షరీఫ్, వి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భైరగాని శ్రీనివాసరావు, పక్కన రైతు సంఘ నాయకులు

పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు దూరం

ఫిరంగిపురం: వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు చాలావరకు దూరమవుతాయని బఫర్ వైద్యురాలు ప్రియాంక అన్నారు. మరీ ముఖ్యంగా భోజనానికి ముందు చేతులు శుభ్రం చేసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని తెలిపారు. మండలంలోని మునగపాడు గ్రామంలో హెల్త్ వెల్‌నెస్ సెంటర్లో ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా నుదురుపాడు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. 180 మందికి డాక్టర్ ప్రియాంక షుగర్, బీపీ తదితర పరీక్షలు చేసి నెలకు సరిపడా మందులు అందజేశారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. పరిశుభ్రమైన వేడిగా ఉన్న ఆహారం తీసుకోవాలని చెప్పారు. తాగునీరు శుభ్రంగా ఉండాలని, లేకుంటే విరోచనాలు (డయేరియా) వచ్చే ప్రమాదం ఉందన్నారు. అలాంటి ఇబ్బంది ఎదురైతే సమీపంలోని అంగన్‌వాడీ సెంటర్, హెల్త్ వెల్‌నెస్ సెంటర్, ఆశా కార్యకర్తల వద్ద మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ కీర్తి, ఏఎన్ఎం పావులమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మల్లికార్జునుడికి నృత్యనీరాజనం



శ్రీశైలంలోని ధర్మపథం వేదికపై నృత్యకారిణుల బృందానికి ప్రశంసాపత్రాలు అందజేసిన దేవస్థాన ఏపీఆర్వో శివారెడ్డి, నాట్యగురువు అనుశేఖర్

- శ్రీశైలంలో మెరిసిన గుంటూరు ప్రతిభ
- ధర్మపథం వేదికగా కూచిపూడి నృత్య ప్రదర్శనలు
- అద్భుతమైన నాట్యంతో ఆకట్టుకున్న గుంటూరుకు చెందిన నృత్యకారిణులు

గుంటూరు ఎడ్యుకేషన్: శ్రీశైలం మహా పుణ్యక్షేత్రంలో గుంటూరుకు చెందిన నృత్యకారిణులు అద్భుతమైన కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఇచ్చారు. ఇటీవల ఏకాదశి సందర్భంగా శ్రీశైల దేవస్థానం ప్రాంగణంలోని ధర్మపథం కళావేదికపై శ్రీ భ్రమరాంబ మల్లిఖార్జున స్వామివార్లకు నృత్యంతో నీరాజనాలు సమర్పించారు. 26 మంది నృత్యకారిణులతో కూడిన బృందం భక్తిగీతాలకు ఇచ్చిన సంప్రదాయ నృత్య ప్రదర్శనలతో భక్తులను మంత్రముగ్ధులను చేసింది. ప్రణవాలయ, దేవాశ్రీగణేషా, భరతవేదమున, శివశివ శంకర, ఓం శివోహం గీతాలతో పాటు శివపార్వతుల కల్యాణం, అన్నమయ్య జీవితగాథపై ప్రదర్శించిన రూపకం భక్తులను విశేషంగా అలరించింది. ఈసందర్భంగా అద్భుతమైన ప్రదర్శన ఇచ్చిన నృత్యకారిణుల బృందాన్ని అభినందించిన ఆలయ అధికారులు వారికి ప్రశంసాపత్రాలు అందజేశారు.

రాష్ట్రంలోని పుణ్యక్షేత్రాల్లో ప్రతి యేటా నృత్య ప్రదర్శలు..

గుంటూరులోని శ్రీనగర్‌కు చెందిన నాట్య గురువు అనుశేఖర్ సారథ్యంలోని నృత్య కారిణుల బృందం ప్రతి యేటా రాష్ట్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఇస్తున్నారు. చిత్తూరుజిల్లా కాణిపాకంలో ప్రతి యేటా శ్రీవరసిద్ధి వినాయకుని బ్రహ్మోత్సవాల్లో క్రమం తప్పకుండా నృత్య ప్రదర్శనలు ఇస్తున్నారు. అదేవిధంగా ఇటీవల షిర్డీలోని సాయి సంస్థాన్ ట్రస్ట్, శ్రీకాళహస్తి, పెదకాకాని ఆలయాల్లో ప్రదర్శనలు ఇచ్చారు. వినాయకచవితి, దసరా నవరాత్రుల్లో గుంటూరు జిల్లావ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లోని ఆలయాల్లో కూచిపూడి నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకుంటున్నారు. గుంటూరు నగరంలోని వివిధ పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థినులు కూచిపూడి నృత్యంలో అద్భుతమైన ప్రావీణ్యం గడించారు. నర్సరీ మొదలు టెన్త్, ఇంటర్, డిగ్రీ వరకు చదువుతున్న విద్యార్థినులు నృత్యంలో అద్భుతమైన ప్రావీణ్యం గడించారు.



నృత్యకారిణుల ప్రదర్శనలు